సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం । 17 । అక్టోబర్ । 2023



సలక్షణంగా అక్షరాభ్యాసం

అక్షరాభ్యాసాలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. 20న వేడుకలు జరగనున్నాయి.

-10లో



లారీ ఢీకొని వ్యక్తి మృతి

టెక్కలిలో లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఇతను మెకానిక్ పనిచేస్తుండేవాడు.

-10లో

18న ప్రెస్ అకాడమీ చైర్మన్ జిల్లాకు రాక

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఈ నెల 18న జిల్లాకు రానున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. ఆయన బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు శ్రీకాకుళం ఆర్ అండ్ బి అతిథి గృహానికి చేరుకుంటారు. అరసవల్లి, శ్రీకూర్మం, శ్రీముఖలింగేశ్వర స్వామి ఆలయాలను దర్శించుకుంటారని తెలిపారు. రాత్రి ఆర్అండ్‌బి బంగ్లాలో బస చేసి తర్వాతి రోజు పార్వతీపురం వెళ్తారని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

ఎన్నికల సామగ్రి పరిశీలన

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మొదటి దశ తనిఖీలను జిల్లాలో ప్రారంభించినట్లు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం కలెక్టర్, ఎస్పీ ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఈవీఎంలను భద్రపరిచే భవనంలో ప్రక్రియ ను ప్రారంభించారు. అనంతరం ఆయన మా ట్లాడుతూ జిల్లాలో ఉన్న మొత్తం 2357 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి అవసరమైన ఈవీఎంలను రెండు, మూడు వారాల పాటు రాజకీయ పార్టీల సమక్షంలో పూర్తిస్థాయిలో పరిశీలించనున్నట్లు వెల్లడించారు. ప్రతి యంత్రంలోనూ ఓట్లు వేసి ఏదైనా సాంకేతిక లోపం ఉన్న వాటిని పక్కన పెట్టి, మిగిలిన వాటిని ఆమోదించే ప్రక్రియ అని వివరించారు. బెంగళూరు నుంచి వచ్చిన బీఈఎల్ సిబ్బంది నిర్వహణలో వెబ్ క్యాస్టింగ్, పటిష్టమైన పోలీసు బందోబస్తు మధ్య పక్రియ జరుగుతుందన్నారు. ప్రతి రోజూ ఉదయం 9గంటల నుంచి సాయంత్రం వరకూ జరిగే కార్యక్రమంలో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరై ఈవీఎంల సాంకేతికతపై అనుమానాలు నివృత్తి చేసుకోవచ్చని చెప్పారు. కేంద్రంలోకి సెల్‌ఫోన్లు అనుమతించబోమని, గుర్తింపు కార్డులు ఉన్న సిబ్బంది మాత్రమే పనిచేస్తారని, సీసీ కెమెరాల్లో నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఆర్వో ఎం. గణపతిరావు, డీపీవో ఎం.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగంలో సీఎం పేరిట ప్రత్యేక పూజలు



శ్రీముఖలింగంలో పూజలు చేస్తున్న కృష్ణదాస్

జలుమూరు: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఇదే కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగనే సీఎం కావాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఆకాంక్షించారు. ఈ మేరకు సోమవారం శ్రీముఖలింగంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేరిట పూజలు నిర్వహించి గోలెం మొక్కులు మొక్కారు. అర్చకులు వారాహి అమ్మవారికి పూజలు చేసిన అనంతరం పుణ్యాహవచనాలతో దీవించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, సర్పంచ్ టి.సతీష్ కుమార్,ఎంపీటీసీ సభ్యులు కె.హరిప్రసాద్ తదితరులు ఉన్నారు.

'వందశాతం ఉత్తీర్ణత సాధించాలి'



జూనియర్ కళాశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా

రణస్థలం: జూనియర్ కాలేజీ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఇప్పటి నుంచే బోధించాలని ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా అన్నారు. ఆయన రణస్థలం జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల ఫలితాలు బాగుంటేనే ప్రవేశాలు బాగుంటాయని తెలిపారు. విద్యార్థులతో మాట్లాడి బోధన పద్ధతులు, సామర్థ్యం తెలుసుకున్నారు. చక్కగా చదువుకోని కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం కళాశాల రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. నాడు–నేడు పనులు చూసి నాణ్యత ప్రమాణాలు, పనులు వేగవంతంపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి. సింహాచలం ఉన్నారు.

పల్లె గుండెల్లో విజయ వీచిక

పల్లె జనాలను కుటుంబ సభ్యుల్లా వరసలు పెట్టి ఆప్యాయంగా పిలవడం, అక్కడి ఆడపడుచులతో తోబుట్టువులా కలిసిపోవడం, ఊరి కష్టసుఖాలు తెలుసుకుని వాటికి పరిష్కార మార్గాలు సూచించడం, రాత్రి అదే పల్లెలో నిద్రపోవడం, ఉదయం లేచి మళ్లీ ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీయడం.. క్షేత్రస్థాయిలో జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ చేసి చూపిస్తున్న కార్యక్రమాలివి. అధినేత ఆదేశాల మేరకు గ్రామగ్రామాన తిరుగుతూ పార్టీ పతాకాన్ని జనం గుండెల్లో ప్రతిష్టిస్తున్నారామె. సంక్షేమ సమాచారం చేరవేస్తూనే.. సమస్యలకు పరిష్కార మార్గం చూపిస్తున్నారు. పల్లె నిద్ర, రచ్చబండ పేరుతో ఆమె నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఆమెలోని నిఖార్సయిన రాజకీయ నాయకురాలికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వృద్ధురాలి ఆప్యాయత

- పల్లెనిద్ర, రచ్చబండతో ప్రజలతో జెడ్పీ చైర్‌పర్సన్ మమేకం
- ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై ఆరా తీస్తున్న పిరియా విజయ
- గ్రామస్తులతో ముఖాముఖిలో సమస్యలు తెలుసుకుంటున్న వైనం
- మురిసిపోతున్న పల్లెజనం



సోంపేట మండలం బారువ గ్రామంలో సోమవారం రాత్రి జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ పల్లెనిద్ర

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: బాబాయ్ బాగున్నావా..? అవ్వా ఆరోగ్యం ఎలా ఉంది..? పిల్లలూ బడికెళ్లి చదువుకుంటున్నారా..? అమ్మా.. పింఛన్ అందుతోందా..? జిల్లా ప్రథమ పౌరురాలు సాధారణ పల్లెవాసులతో మాట కలుపుతున్న పద్ధతి ఇది. జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ చేపడుతున్న పల్లె నిద్ర, రచ్చబండ కార్యక్రమంలో ఇలాంటి ఆప్యాయమైన పలకరింపులు కనిపిస్తున్నాయి. జిల్లాలో ఇంతవరకు ఏ మహిళా నేత చేపట్టని ఈ వినూత్న కార్యక్రమం ప్రజల మన్ననలను అందుకుంటోంది. పేరు ఒకలా తీరు మరోలా కాకుండా పల్లె నిద్ర అంటే అచ్చంగా అదే పల్లెలో నిద్రిస్తూ.. రచ్చబండపై ముఖాముఖి మాట్లాడుతూ ఆమె ఆదర్శప్రాయంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

ప్రజల యోగ క్షేమాలను తెలుసుకునేందుకు జిల్లా ప్రథమ పౌరురాలు పిరియా విజయ పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నారు. తన హోదాని పక్కన పెట్టి ఒక సాధారణ మహిళగా గ్రామస్తులతో కలిసిపోతున్నారు. సొంత మనిషిగా మెలిగి లోటుపాట్లను తెలుసుకుంటున్నారు. గ్రామస్తులతో ముఖాముఖీ తర్వాత రాత్రి బస చేసి గ్రామాల పరిస్థితులను చూస్తున్నారు. రోజంతా గ్రామంలోనే ఉండి అక్కడి స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. సమస్యలు తెలుసుకుని, సంక్షేమాలను వివరించి వారితో మమేకమవుతున్నారు.

కార్యక్రమం జరుగుతోందిలా..

- ఇచ్ఛాపురం నియోజకవర్గంలో సెప్టెంబర్ 30వ తేదీ నుంచి సోంపేట మండలం ఉప్పలాం సచివాలయంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రచ్చబండ, పల్లెనిద్ర కార్యక్రమాలను జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అమలు చేయడం ప్రారంభించారు.
- సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు సంబంధిత గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారికి అందించినవి తెలియజేస్తూ, వారికి ఇంకేం కావాలో తెలుసుకొనే ప్రయత్నం చేసి, వాటిని అక్కడికక్కడే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కారం చూపిస్తున్నారు.
- రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు గ్రామస్తులు, మహిళలతో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, వారికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను తెలియజేస్తున్నారు. స్థానికంగా ఉండే సమస్యలను తెలుసుకొని, వాటిని అప్పటికప్పుడే సంబంధిత అధికారులతో పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు.
- తర్వాత ఆ గ్రామస్తులతోనే రాత్రి భోజనం చేసి, అక్కడే పల్లెనిద్ర చేస్తున్నారు.
- మరుసటి రోజు ఉదయం 6 గంటలకు నిద్రలేచి, మహిళలతో టీ తాగుతూ వారితో రచ్చబండపై సమావేశమవుతున్నారు.
- గ్రామంలో అందుబాటులో ఉన్న టిఫిన్ చేసి మళ్లీ ఉదయం 7 గంటలకు పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, మిగతా ప్రజాప్రతినిధులు, పార్టీ క్యాడర్, గ్రామస్తులతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ముందురోజు మిగిలిపోయిన గడపలను తిరిగేలా మరుసటి రోజు ఉదయం 11గంటల వరకు నిర్వహిస్తున్నారు.



ఉప్పలాంలో ఆటోలో ప్రయాణిస్తూ ప్రజలతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

9 గ్రామాల్లో పల్లెనిద్ర, రచ్చబండ..

- ఇచ్ఛాపురం నియోజకవర్గంలో సెప్టెంబర్ 30వ తేదీన సోంపేట మండలం ఉప్పలాం గ్రామంలో ప్రారంభించిన పల్లెనిద్ర, రచ్చబండ కార్యక్రమాలను ఇప్పటి వరకు 9 చోట్ల నిర్వహించారు.
- నియోజకవర్గంలోని ఉప్పలాం, బట్టిగళ్లూరు, గొల్లవూరు, శాసనాం, మామిడిపల్లి–1, మామిడిపల్లి–2, ఇచ్ఛాపురం మండలం డొంకూరు, అరకభద్ర గ్రామాలు, కవిటి మండలం భైరిపురం గ్రామాల్లో చేపట్టారు. వేలాది గడపలను సందర్శించారు. వందలాది సమస్యలను స్వీకరించారు.
- సోంపేట మండలం ఉప్పలాంలో 110, గొల్లవూరులో 20, టి.శాసనం పంచాయతీలో 10, మామిడిపల్లి పంచాయతీలో 30, కవిటి మండలం భైరీపురంలో 20, ఇచ్ఛాపురం మండలం టి.బరంపురంలో 10, అరకభద్రలో 10, డొంకూరులో 10 వినతులను స్వీకరించారు.
- వచ్చిన అర్జీల్లో చాలా వరకు హౌసింగ్, రేషన్ కార్డు, డ్రైనేజీ తాగునీటి, రోడ్లు తదితరమైనవి ఉన్నాయి. ఇవన్నీ వెంటనే పరిష్కరించదగ్గ వినతులే కావడంతో అక్కడికక్కడే అధికారులతో మాట్లాడుతున్నారు. పరిష్కారాలను చూపుతూ ప్రజలతో మమేకమవుతున్నారు పిరియా విజయ.



ఇచ్ఛాపురం డొంకూరులో నిర్వహించిన రచ్చబండలో గ్రామస్తుల సమస్యలు తెలుసుకుంటున్న విజయ

అలంకార రూపిణి

శరన్నవరాత్రి ఉత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. మండపాలు, ఆలయాల వద్దకు భక్తులు భారీగా చేరుకుని తల్లిని అర్చిస్తున్నారు.



ఇచ్ఛాపురం: బ్రహ్మచారిణి అలంకరణలో స్వేచ్ఛావతి అమ్మవారు

నవరాత్రి వైభవం



పాతపట్నం: గాయత్రీదేవిగా నీలమణిదుర్గ అమ్మవారు



శ్రీకాకుళం కల్చరల్ : గాయత్రీ దేవిగా విజయదుర్గ

స్పందనకు 229 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 229 వినతులు వచ్చాయి. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ప్రత్యేక ఉప కలెక్టర్ డాక్టర్ జి.జయదేవి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావులు అర్జీలు స్వీకరించారు. వినతి అందజేయడానికి వచ్చిన ఓ వృద్ధుడికి కలెక్టర్ విభిన్న ప్రతిభావంతుల కార్యాలయం నుంచి ఒక వినికిడి యంత్రాన్ని అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ స్పందన ద్వారా అర్జీదారులు లాభపడాలని, ఈ విషయంలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి వి.ఎస్.ఎస్ లక్ష్మీప్రసన్న, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఆర్. వెంకట రామన్, జిల్లా పంచాయతీ అధికారి వి.రవి కుమార్, గృహ నిర్మాణ సంస్థ పథక సంచాలకులు ఎస్. గణపతి, జిల్లా ఉద్యానవన అధికారి ఆర్‌వీ వరప్రసాద రావు, జిల్లా సరఫరాల అధికారి డీవీ రమణ, సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త డాక్టర్ ఆర్.జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు 20 అర్జీలు



జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జీఆర్ రాధిక సోమవారం నిర్వహించిన పోలీస్ స్పందన కార్యక్రమానికి 20 అర్జీలు వచ్చాయి. అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ వాటిని పరిష్కరించాలని అదనపు ఎస్పీ టీపీ విఠలేశ్వరరావును ఆదేశించారు.

కులగణన నిర్ణయం చరిత్రాత్మకం

ఇచ్ఛాపురం రూరల్: ఏపీలో కుల గణన చేపట్టేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీన ఢిల్లీరావు అన్నారు. లొద్దపుట్టి ప్రజా సంకల్పయాత్ర విజయ స్థూపం వద్ద సోమవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు మేలు చేసే విషయంలో సీఎం జగనన్న దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఏ కుల జనాభా ఎంతనేది స్పష్టంగా తెలుస్తుందని, కుల గణనను పూర్తి పారదర్శకంగా జరిపించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి పిన్నింటి జోగారావు, సోంపేట మండల బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి ఇరోతు శ్రీనివాసరావు, బారువ పట్టణ బీసీ సంఘం నేత ఎస్.ఉమామహేశ్వరరావు, బీసీ సంఘం ప్రతినిధులు గుడియా జగ్గారావు, రుషి తదితరులు పాల్గొన్నారు.



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీసీ సంఘం ప్రతినిధులు

'బాల్య వివాహాల నిర్మూలనకు కృషి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: బాల్య వివాహ రహిత దేశ నిర్మాణానికి కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా కోర్టులోని న్యాయ సేవాసదన్‌లో సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, చైల్డ్‌లైన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మ సంబరం

- నేటి నుంచి కొత్తమ్మతల్లి ఉత్సవాలు ప్రారంభం
- పకడ్బందీగా ఏర్పాట్లు

కోటబొమ్మాళి: ఉత్తరాంధ్రుల ఇష్టదైవం కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు జరగనున్న ఉత్సవాలను మొదటి రోజు గ్రామానికి చెందిన కమ్మకట్టు చినఅప్పలనాయుడు వారసులు అమ్మవారికి ముర్రాటలు సమర్పించి ప్రారంభిస్తారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులు అమ్మవారి దర్శనం చేసుకుంటారు. జాతరకు 5 లక్షలకు పైగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ఆ మేరకు అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. మంత్రులు, ఉన్నతాధికారులు అమ్మవారి దర్శనానికి రానున్నందున 400 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు క్యూలు, తాగునీరు, వైద్యసాయం, మూడు రోజులపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, సంగిడీలు, వెయిట్ లిఫ్టింగ్, ఉలవల బస్తాల పోటీలు నిర్వహిస్తారు. ఉత్సవంలో మూడోరోజు అమ్మవారికి ప్రీతి పాత్రమైన ఘటాల పండుగ నిర్వహిస్తారు.



కొత్తమ్మ తల్లి

మెహరీన్.. మెరిసెన్



కాశీబుగ్గ: సినీ హీరోయిన్ మెహరీన్ సోమవారం పలాసలో మెరిసింది. ఆమెను చూసేందుకు స్థానిక యువకులు ఎగబడ్డారు.

ఆదిత్యుని సన్నిధిలో..

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ప్రముఖ సినీ హీరోయిన్ మెహరీన్ సోమవారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అర్చకులు ఆమెకు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఈ సందర్భంగా మెహరీన్ విలేకరులతో మాట్లాడుతూ సూర్య దేవాలయం దర్శించుకోవడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని, సినీరంగంలో తనకంటూ గుర్తింపు రావడం దేవుని ఆశీస్సులతోనే సాధ్యమైందని అన్నారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు, అర్చకులు ఇప్పిలి ఫణీంద్ర శర్మ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రభుత్వం దృష్టికి క్రిస్టియన్ మైనారిటీ సమస్యలు



సమావేశంలో మాట్లాడుతున్న మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్

ఇచ్ఛాపురం: జిల్లాలో గల క్రిస్టియన్ మైనారిటీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్ అన్నారు. పట్టణంలో గల క్రిస్టియన్ మైనారిటీ సెల్ కార్యాలయం ఆవరణలో సోమవారం జిల్లాలో గల క్రిస్టియన్ మైనారిటీ పెద్దలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో క్రిస్టియన్ మైనారిటీ పెద్దలు మాట్లాడుతూ జిల్లాలో గల ఏడు నియోజకవర్గాల్లో క్రిస్టియన్లకు ఉపయోగపడే కమ్యూనిటీ భవనాలు, ప్రహరితో కూడిన శ్మశాన వాటికలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం స్థలాలను కేటాయించాలని కోరారు. సీఎం వైఎస్ జగన్ రాజకీయాలకు అతీతంగా పాలన అందజేస్తున్నారని అన్వేష్ అన్నారు. మళ్లీ అన్ని చోట్లా వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనారిటీ సెల్ స్టేట్ జనరల్ సెక్రటరీ జాన్ డేవిడ్, జాయింట్ సెక్రటరీ కణితి విజాక్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి చిన్నారావు, జనరల్ సెక్రటరీ గంటా పిలోమెను, జాయింట్ సెక్రటరీ రౌతు దేవకిరణ్, సెక్రటరీ ఎం.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 8న రైల్వేలో ప్రత్యేక అదాలత్

- కారుణ్య నియామక పెన్షన్‌దారుల కోసం..

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలో పెండింగ్ కారుణ్య నియామక పెన్షన్ కేసులకు సంబంధించి నవంబర్ 8న ప్రత్యేక అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు. దొండపర్తి డీఆర్‌ఎం కార్యాలయంలోని సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ కార్యాలయంలో ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అదాలత్ ఉంటుందన్నారు. తగిన ఫార్మాట్‌లో మరణించిన రైల్వే అధికారులు, పింఛన్‌దారుల వివరాలను ఎ–4 పేపర్‌పై రాసి.. అక్టోబరు 31లోగా డివిజనల్ రైల్వే మేనేజర్(పి), మొదటి అంతస్తు, డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం కాంప్లెక్స్, దొండపర్తి చిరునామాకు పంపించాలన్నారు. కవరుపై కారుణ్య అదాలత్– 2023/ఈస్ట్‌కోస్ట్ రైల్వే/వాల్తేర్ అని కచ్చితంగా రాయాలని సూచించారు.

నాటుసారా కేసులో మరో వ్యక్తి అరెస్టు

మందస: మండలంలో సంచలనం సృష్టించిన నాటుసారా కేసులో మందస పట్టణానికి చెందిన గార పాపారావును సోమవారం అరెస్ట్ చేసినట్టు ఎస్‌ఐ సీహెచ్ హరికృష్ణ తెలిపారు. ఒడిశా సరిహద్దు నుంచి మందసకు చెందిన పాపారావు బొలెరో వాహనంలో నాటుసారా తరలిస్తుండగా పోలీసులు రూ.2.50లక్షలు విలువైన నాటుసారా బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. సంఘటన స్థలంలోనే బొందికరి గ్రామానికి చెందిన సవర గోపి, బలరాం, కృష్ణలను పట్టుకున్నారు. నాటుసారా రవాణాకు సంబంధించిన నిందితుడు గార పాపారావు పరారీలో ఉన్నట్టు ఎస్‌ఐ ఆదివారం ప్రకటించారు. దీంతో ఆయనను సోమవారం అరెస్ట్ చేసి కోర్టుకు తరలించామన్నారు. గోపి, బలరాం, కృష్ణలను సోంపేట కోర్టుకు తరలించారు. సోంపేట కోర్టులో వీరికి రిమాండ్ విధించగా నరసన్నపేట జైలుకు తరలించామని ఎస్‌ఐ హరికృష్ణ చెప్పారు.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు



తురకలకోట వద్ద పక్కకు ఒరిగిన ఆర్టీసీ బస్సు

నందిగాం: మండలంలోని తురకలకోట వద్ద సోమవారం సాయంత్రం ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు అదుపు తప్పి పక్కనున్న కాలువలోకి ఒరిగింది. శ్రీకాకుళం రెండో డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సు ఇచ్ఛాపురం నుంచి శ్రీకాకుళం వెళ్తుండగా నందిగాం మండలం తురకలకోట వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి మితిమీరిన వేగంతో బస్సు వైపు వస్తున్న లారీను తప్పించే ప్రయత్నంలో రోడ్డు ప్రక్కన ఉన్న కాలువలోకి ఒరిగిపోయింది. ప్రమాద సమయంలో బస్సులో కేవలం ఆరుగురు మాత్రమే ఉండటంతో ప్రమాదం తప్పింది. ప్రయాణికుల్లో ఒకరైన టెక్కలి శ్రీనివాసనగర్‌కు చెందిన బాలామణి అనే వృద్ధురాలికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం గుర్తించిన హైవే అంబులెన్స్ సిబ్బంది ప్రయాణికులకు సపర్యలు చేసి స్వల్పంగా గాయపడిన వృద్ధురాలిని టెక్కలి ఆస్పత్రికి తరలించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹235	₹ 255

సలక్షణంగా అక్షరాభ్యాసం



పీఎన్‌కాలనీలో నిర్వహిస్తున్న సామూహిక అక్షరాభ్యాసాలు (ఫైల్)

- 20న సామూహిక అక్షరాభ్యాసాలు
- వేడుకకు ముస్తాబవుతున్న ఆలయాలు

శ్రీకాకుళం కల్చరల్: దసరా నవరాత్రుల సమయంలో వచ్చే ముఖ్యమైన రోజు మూలా నక్షత్రయుత ఆశ్వయుజ షష్టి. ఈ పవిత్ర దినాన ప్రత్యేకంగా సరస్వతీ మాతకు పూజలు చేసి హోమాలు నిర్వహిస్తారు. అలాగే ఎంతో మంది తమ పిల్లలకు అక్షరాభ్యాసాలు చేయిస్తారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు అక్షరాభ్యాసాలు నిర్వహించుకునేందుకు వీలుగా వాటి వివరాలు..

- పీఎన్ కాలనీలోని వరసిద్ధి వినాయక పంచాయతన దేవాలయంలో ఉన్న శ్రీరాజరాజేశ్వరీ అమ్మవారికి దసరా ఉత్సవాల సందర్భంగా పూజలు చేస్తారు. ఇక్కడ ఉన్న జ్ఞాన సరస్వతీ దేవి వద్ద ఏటా అధిక సంఖ్యలో చిన్నారులకు తల్లిదండ్రులు అక్షరాభ్యాసాలు నిర్వహిస్తారు. అయితే ఈనెల 20వ తేదీన ఉదయం 8గంటల నుంచి సామూహిక అక్షరాభ్యాసాలు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మూడు బ్యాచ్‌లుగా నిర్వహిస్తారు. ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. అందుకోసం 9381949794, 9493085708 నంబర్లకు ఫోన్ ద్వారా నమోదు చేసుకోవచ్చు.
- బాకర్ సాహెబ్ పేటలోని శ్రీదుర్గామహాలక్ష్మీదేవి ఆలయం వద్ద జరిగే ఉత్సవాల్లో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెన్నేటి సునీల్ శర్మ తెలిపారు. పాల్గొన దలిచే వారు 96183 90488 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.
- గోవిందనగర్ కాలనీలోని శ్రీరాజరాజేశ్వరీదేవి ఆలయంలో సరస్వతీ మాత హోమం నిర్వహిస్తున్నామని, సామూహిక అక్షరాభ్యాసాలు కూడా నిర్వహిస్తున్నామని నిర్వాహకులు మొదలవలస ఉషారాణి తెలిపారు. పాల్గొనే వారు 9440759604, 7989746140 నంబర్లకు సంప్రదించాలని కోరారు.
- బలగ నాగావళి తీరంలో ఉన్న బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో 20వ తేదీన సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గణేష్ గురూజీ తెలిపారు. తమ పిల్లలకు అక్షరాభ్యాసాలు చేయించే తల్లిదండ్రులు 9515880619, 9398466840 నంబర్లను సంప్రదించాలని కోరారు.
- నానుబాలవీధిలో వెలసిన విజయదుర్గా అమ్మవారి ఆలయంలో మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతీ దేవి అవతారంలో ఉన్న అమ్మవారికి సరస్వతీ హోమం నిర్వహిస్తారు. పాల్గొనే విద్యార్థులకు సరస్వతీ దేవి డాలర్ అందజేస్తామని తెలిపారు. పాల్గొన దలిచే వారు 9676560554, 9155555599 నంబర్లను సంప్రదించాలి.

విజయనగరం జ్ఞాన సరస్వతీ ఆలయంలో..

విజయనగరంలోని జ్ఞాన సరస్వతీ దేవి ఆలయంలో మూలా నక్షత్రం రోజున పిల్లలకు అక్షరాభ్యాసాలు చేయించేందుకు ఈ నెల 15వ తేదీ నుంచి టిక్కెట్లు విక్రయిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ ఎవరైనా అక్షరాభ్యాసం చేయించ దలచుకుంటే 9494777672 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మంత్రికి వినతి



మంత్రి అప్పలరాజును సత్కరిస్తున్న 1998 ఉపాధ్యాయులు

కాశీబుగ్గ: రాష్ట్ర పశుసంవర్ధక పాడి పరిశ్రమల మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును సోమవారం పలాసలోని ఆయన ఇంటిలో 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, రిటైర్‌మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచాలని కోరుతూ వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో లండ మల్లేశ్వరరావు, తామాడ రాజామహేష్, యవ్వారి ధనుంజ్, బమ్మిడి చిరంజీవులు, పొట్నూరు మురళీకృష్ణ, వజ్రపుకొత్తూరు, మందస, పలాస మండలాలకు చెందిన 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ వినియోగించుకోండి



మాట్లాడుతున్న శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ మాధవ్

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో హెవీ వెహికల్ డ్రైవింగ్‌లో ఇచ్చే శిక్షణను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ కె.మాధవ్ పిలుపునిచ్చారు. ఏపీఎస్‌ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్ శ్రీకాకుళంలో 14వ బ్యాచ్‌ను సోమవారం శ్రీకాకుళం 1డిపో మేనేజర్ కె.మాధవ్ ప్రారంభించారు. ఏపీఎస్‌ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో ఇప్పటివరకు 13 బ్యాచులు శిక్షణ పూర్తి చేసుకున్నాయని, ఆర్టీసీలో చాలా విలువలతో కూడిన శిక్షణ ఇస్తామని తెలిపారు. ప్రతి ఒక్క విషయాన్ని కూడా జాగ్రత్తగా అవగాహన చేసుకుని నేర్చుకుంటే భవిష్యత్‌లో ఉన్నతమైన, సుశిక్షితులైన డ్రైవర్లుగా తయారవుతారని అన్నారు. ఆర్టీసీతో పాటు మిగతా డిపార్ట్‌మెంట్‌లలో కూడా మంచి ఉద్యోగ అవకాశాలు పొందుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం 2డిపో మేనేజర్ కే.ఆర్.ఎస్. శర్మ, డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ వర్మ, ఏఎస్ఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు. తదుపరి బ్యాచ్ వివరాల కోసం మరియు నిర్ణీత ఫీజు, డాక్యుమెంట్స్ వివరాల కోసం 9963091999, 7989723505 నంబర్లను సంప్రదించాలని ఆర్టీసీ అధికారులు కోరారు.

● వెయ్యిన్నొక్క బిందెలతో జలాభిషేకం



పెద్దలంబ పంచాయతీ నారాయణపురం గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివలింగానికి వెయ్యిన్నొక్క బిందెల నీటితో సోమవారం జలాభిషేకం చేశారు. వానలు కురవాలని కోరుతూ అభిషేకం నిర్వహించినట్లు స్థానికులు తెలిపారు. - సారవకోట

హాస్టల్ పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: విద్యార్థులకు భోజనం, ఇతర వసతులు సక్రమంగా అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. శ్రీకాకుళంలోని రామలక్ష్మణ జంక్షన్ దగ్గర ఉన్న ప్రభుత్వ బీసీ కాలేజ్ బాలికల వసతి గృహాన్ని ఆయన సోమవారం సందర్శించారు. విద్యార్థినులకు అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. విద్యార్థి దశ జీవితంలో చాలా కీలకమైనదని, చదువు అనేది మనిషిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లగలిగే ఏకైక మార్గమని అన్నారు. విద్యార్థినులు అందరూ చదువుపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. వసతి గృహం నిర్వహణపై ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. వంటగది, స్టోర్ రూం, సరుకులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. కార్యక్రమంలో వసతి గృహం సంక్షేమ అధికారి గుర్రాల లలిత, ఇతర హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ మద్యం విక్రయదారులపై కేసులు

కవిటి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల అక్రమ మద్యం విక్రయిస్తున్న ముగ్గురిపై కేసులు నమోదుచేసినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్‌ఐ ఎస్.గురుమూర్తి తెలిపారు. ఈ మేరకు ఈ కేసుల్లో ముద్దాయిల్ని సోమవారం కవిటిలో మండల మేజిస్ట్రేట్ కోర్టులో మండల మేజిస్ట్రేట్ పి.శేఖర్ ఎదుట హాజరుపరిచారు. ఈ నెల 2 వ తేదీన 20 మద్యం సీసాలతో పట్టుబడిన రాజపురం నివాసి టెంక మోహనరావుకు రూ.2లక్షల అపరాధ రుసుంతో బైండోవర్ కేసు, ఈ నెల 4 న దొరికిన బల్లిపుట్టుగకు చెందిన నల్లాన రామారావుకు రూ.30,000 అపరాధ రుసుంతో బైండోవర్ కేసు, సెప్టెంబర్ 7న దొరికిన ఆర్.బెలగాం నివాసి దేవాడ కేశవరామరాజుకు రూ.2లక్షల అపరాధ రుసుంతో పాటు బైండోవర్ కేసుల్ని విధించినట్టు తెలిపారు.

'సుడిదోమ' సోకిన పొలాల పరిశీలన



కుంటికోట వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

మందస: మండలంలో సుడిదోమ సోకిన పొలాలను వ్యవసాయాధికారులు సోమవారం పరిశీలించారు. కుంటికోట, వీరగున్నమ్మపురం, వాసుదేవపురం, అచ్యుతాపురం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి జి.నాగరాజు మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిపంటకు సుడిదోమ ఆశించే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ తెగులు వరి పిలకలు వేసే దశ నుంచి పంటకాలం పూర్తయ్యేవరకు కూడా సోకే అవకాశం ఉందన్నారు. సుడిదోమ లక్షణాలు, నివారణ చర్యలు రైతులకు వివరించారు. మరిన్ని వివరాలకు వ్యవసాయ కార్యాలయంలో గానీ, రైతు భరోసా కేంద్రంలోని సిబ్బందిని గానీ సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, కుంటికోట సర్పంచ్ దుంపల వైకుంఠరావు, వ్యవసాయ విస్తరణాధికారి బల్లు జగ్గారావు, వీఏఏ ప్రశాంతి, పార్టీ నాయకులు దాసరి రామారావు, రైతులు టొంప శేఖర్, దాసరి నారాయణ, రొక్కం మోహనరావు ఉన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



మృతుడు చంద్రశేఖర్ (ఫైల్)

టెక్కలి రూరల్: స్థానిక అంబేడ్కర్ జంక్షన్ వద్ద సోమవారం సాయంత్రం లారీ ఢీ కొని టెక్కలి శ్రీరామ కాలనీకి చెందిన కె.చంద్రశేఖర్(22) అనే యువకుడు మృతి చెందాడు. ఈ మేరకు స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు పెద్ద, పెద్ద రాళ్లను తీసుకెళ్లి తిరిగి వస్తున్న లారీ టెక్కలి అంబేడ్కర్ జంక్షన్ వద్ద రోడ్ పక్కగా నడుస్తూ వెళ్తున్న చంద్రశేఖర్‌ను ఢీకొట్టింది. చంద్రశేఖర్ కింద పడగా.. అతని తలపై నుంచి చక్రం వెళ్లడంతో అక్కడికక్కడే ఆయన మృతి చెందాడు. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు లారీని ఆపి డ్రైవర్‌ను పోలీసులకు అప్పగించారు. మృతుడి తండ్రి గతంలోనే చనిపోయారు. తల్లి వలస కూలీ. ఇతను మెకానిక్‌గా పనిచేస్తూ మేనమామ ఇంటి వద్ద ఉంటున్నాడు. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న డీఎస్పీ బాలచంద్రారెడ్డి, సీఐ చంద్రమౌళి ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని శవపంచనామా కోసం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

చీపురుపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్ పరిధిలో రైలు నుంచి జారి పడి జంగేటి మణికంఠ(25) అనే యువకుడు మృతి చెందినట్లు జీఆర్‌పీ హెచ్‌సీ రమేష్ తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. శ్రీకాకుళం పట్టణంలోని జెండాలవీధికి చెందిన మణికంఠ ఆదివారం రాత్రి విశాఖపట్నం నుంచి ఆమదాలవలసకు ఈస్ట్ కోస్ట్ రైలులో ప్రయాణిస్తుండగా చీపురుపల్లి వచ్చే సరికి ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు హెచ్‌సీ తెలిపారు.

ఆర్ట్స్ కళాశాలలో గిడుగు వారసులు



గిడుగు రామ్మూర్తి పంతులు కుటుంబ సభ్యులతో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది

శ్రీకాకుళం న్యూకాలనీ: వ్యావహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి కుటుంబ సభ్యులు సోమవారం శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ(ఆర్ట్స్) కళాశాలను సందర్శించారు. హైదరాబాద్‌లో నివాసముంటున్న గిడుగు వారి ఐదో తరం వారసులైన గిడుగు సరస్వతి కుటుంబ సమేతంగా విచ్చేసి కళాశాల తెలుగు విభాగాన్ని సందర్శించడంతోపాటు కళాశాల ప్రాంగణంలో గల గిడుగు రామ్మూర్తి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. గిడుగు సేవలను, వారి అనుభవాల గురించి తెలియజేశారు. అనంతరం కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఎంవీ సత్యనారాయణ తెలుగు విభాగం తరఫున వారిని సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ పైడి వెంకటరమణ, తెలుగు అధ్యాపకులు డాక్టర్ ఢిల్లీశ్వరరావు, ఆంగ్ల అధ్యాపకులు డాక్టర్ శశిభూషణ్, హిందీ అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాసరావు పాత్రో, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రోత్సాహం



- బొబ్బిలి గ్రోత్‌సెంటర్‌కు వెళ్లే రోడ్ల అభివృద్ధికి సన్నాహాలు
- ఐలా నిధులతో పనులు
- రామకృష్ణాపురంలో ఏపీఐఐసీ లే అవుట్
- 60 ఎకరాల్లో అరఎకరా చొప్పున 70 ప్లాట్లు



ఇలాంటి రోడ్లను అభివృద్ధి చేయనున్నారు



బొబ్బిలి: ఉత్తరాంధ్రలో పరిశ్రమల ఏర్పాటుకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. పరిశ్రమలకు అనువైన చోట భూములు కొనుగోలుచేసి ప్లాట్లు వేస్తోంది. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్లాట్లను కేటాయిస్తోంది. ఇప్పటికే ఉన్న పారిశ్రామిక పార్కుల అభివృద్ధికి కృషిచేస్తోంది. ఉత్తరాంధ్రలో చిన్నతరహా పరిశ్రమలు ఎక్కువగా ఉన్నది బొబ్బిలి గ్రోత్ సెంటర్ ప్రాంతం. ఇక్కడ దాదాపు 300కు పైగా ప్లాట్లు ఉన్నాయి. దాదాపు 30 ఏళ్ల కిందట ఇక్కడ నిర్మించిన ప్రధాన, అంతర్గత రోడ్లు మరమ్మతులకు గురయ్యాయి. గత ప్రభుత్వం వీటిగురించి పట్టించుకోలేదు. దీంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చాలాచోట్ల రోడ్లు ప్రమాదకరంగా మారాయి. నారాయణప్పవలస వెళ్లే ప్రధాన రోడ్డు, ఎం.బూర్జివలస, గున్నతోటవలస, మెట్టవలస ప్రాంతాలకు వెళ్లే రోడ్లు పూర్తిగా పాడయ్యాయి. వీటిని 'ఐలా' నిధులతో బాగుచేసేందుకు ఏపీఐఐసీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పరిశ్రమలకు నీటిని సరఫరా చేసే మోటార్లు, స్లంప్‌లను కూడా బాగుచేయనున్నారు. పనుల కోసం గతంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఎంఎస్ఈ డీపీ (మైక్రో స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ అండ్ డవలప్‌మెంట్ ప్రొగ్రాం) కింద గ్రోత్ సెంటర్ అభివృద్ధికి రూ.5 కోట్లు అవసరంగా పేర్కొన్నారు. ఈ నిధులు వచ్చేలోగా ఐలా కింద పన్నుల రూపంలో వసూలవుతున్న నిధులను వెచ్చించి మరమ్మతులు చేసేందుకు అధికారులు నిర్ణయించారు. దీంతో పరిశ్రమల యజమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు దశాబ్దాల తరబడి గ్రోత్ సెంటర్‌లో రోడ్లు, డ్రెయినేజీలు మరమ్మతులకు గురయ్యాయి. వీటిని మరమ్మతులు చేయడం వల్ల పరిశ్రమల నిర్వహణకు మేలు కలుగుతుందని పారిశ్రామిక వర్గాలు చెబుతున్నాయి.

70 ప్లాట్లతో కొత్త పరిశ్రమల కేంద్రం

విజయనగరం, శ్రీకాకుళం జోన్ పరిధిలోని రామకృష్ణాపురంలో 60 ఎకరాల్లో 70 ప్లాట్లను సిద్ధం చేశారు. ఇప్పుడు ఆ ప్రాంతంలో అభివృద్ధి కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. కొద్దిరోజుల్లో నిధులు మంజూరుకానున్నాయి. పరిశ్రమలు ఏర్పాటు చేసే ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తాం.

– యతిరాజు, జోనల్ మేనేజర్, ఏపీఐఐసీ

పారిశ్రామిక వేత్తలకు స్థలాల కేటాయింపు

ఏపీఐఐసీ శ్రీకాకుళం జిల్లా రామకృష్ణాపురంలో 60 ఎకరాలతో పరిశ్రమల కేంద్రాన్ని కొత్తగా ఏర్పాటు చేయనుంది. దీనికోసం 60 ఎకరాల భూములను సేకరించింది. నిర్వాసితులకు రూ.7 కోట్లను ఇప్పటికే చెల్లించింది. అర ఎకరా చొప్పున 70 ప్లాట్లుగా విభజించిన యంత్రాంగం రూ.10 నుంచి 12 కోట్ల ఖర్చుతో రోడ్లు, విద్యుత్, నీటి అవసరాలను తీర్చేందుకు సిద్ధమవుతోంది. పనులు పూర్తయిన వెంటనే ఆన్‌లైన్‌లో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తారు.